# ఆరిపోయిన దీపం

దీపావళి అమావాస్య. ఆనాడు ఆకాశంలో చుక్కలు కొన్ని భూమిమీదికి దిగిపోయినాయా, లేక భూమిమీద ఈ దీపాలు నక్షత్రాలతో పోటీ చేస్తున్నాయా అనిపిస్తుంది. ఆ ఒక్కరోజూ భూమీ ఆకాశం కలిసి ఏదో పండుగ చేసుకుంటూన్నట్టుంది.

కాంతి పుంజాలు అమావాస్య కారుచీకటిని కాలదన్నుతున్నాయి.

తారాజువ్వలు ఆకాశంలోకి చొచ్చుకుపోయి పై గ్రహాల్లోకి పోవాలని కాబోలు ఎన్నాళ్ళనుండీ ప్రయత్నం చేస్తూ పడిపోతున్నాయో! ఈనాటికి వాటిజాతికి చెందిన రాకెట్ సాధించింది ఆ లక్ష్యం.

ఒక్క నిమిషంలో మొలిచి పుష్పించి కాసి ఆకులని పూలని రాల్చేసే వింతవింత చిచ్చుబుడ్లు వాటికవే సాటి!

ఏమరచి నవ్వుతూ ఆనందంలో మునిగివున్నవారిని జడిపించి పరుగెట్టించి వాళ్ళెక్కడ కెళ్ళినా వెంటవెళ్ళి ముట్టడిస్తున్నాయి డిటెక్టివ్‌లలాగ చించింద్రీలు.

పరధ్యాన్నంగా పండుగచేసుకుంటున్నవారిని 'ఢాం' అని పేలి త్రుళ్ళిపడ్డట్టుచేసి, గుండె లదిరి దీపాలు ఆర్పేస్తున్నాయి చీమపటాకీలు, అఘఢాలూ.

ఎదురింట్లో చంటిపిల్లడు కాకరపువ్వొత్తులు తానూ కాలుస్తానని మారాం చేస్తూ, చేతి కివ్వగానే భయంతో ఏడుస్తూ- దూరంనించే చూసి చప్పట్లుకొడుతూ నవ్వ

తున్నాడు. పిల్లలిని వూరుకోబెట్టే మిషతో - ముసలివాళ్లు తాముకాల్చి చిన్నతనంకోర్కెలని తీర్చుకుంటున్నారు.

నిప్పుతో నిండిన వీధిలోకి పోయి కాలుస్తామంటూ గంతులేస్తున్న పిల్లలని అదుపులో పెట్టడం వాళ్ళతరం కాకుండావుంది తల్లులకి.

వీధిచివర మందిరందగ్గర ఆవీధివాళ్ళూ, యీ వీధి వాళ్లూ పార్టీలయి యుద్ధానికి తలబడ్డారు- ఇటుంచి అటూ, అటుంచి ఇటూ.

నిప్పులవర్షం కురుస్తోంది. జువ్వలు, టెంకాయలు, వెలం కాయలు రకరకాలు చక్రాల్లా భయంకరంగా తిరుగుతూ నిప్పారొప్పుతూ ఢీకొంటున్నాయి... ఆనందంతో యిరుపక్షాలవాళ్లూ హెచ్చరికలు చేసుకొంటూ అరుస్తున్నారు.

ఆరిపోతున్న జ్యోతులలో నూనెపోసి వత్తులు ఎగదోస్తున్నారు పడుచులు... ఏ పటాకియో పేలేసరికి 'అమ్మయ్యో!' అని హృదయం పట్టుకొని యిళ్ళల్లోకి ఒక్క గంతేస్తున్నారు. కిలకిలలాడి మళ్లీ యివతలకొస్తున్నారు. చీమపటాకీలు ధనధనలాడేసరికి 'అబ్బా!' అని చెవులు మూసుగుంటున్నారు... వాళ్లు కాలుస్తున్న మతాబుల్లోంచి వెన్నముద్దలు రాల్తూంటే ఆ కాంతుల్లో వాళ్లనవ్వులు కలిసిపోతున్నాయి.

కొత్తగా పెళ్లయిన ఆడపిల్లలు తమ ప్రియుల సమక్షంలో కాల్చడానికి సిగ్గుపడుతూ, క్రేగంట వారిని చూస్తూ, ముసిముసి నవ్వులతో సంజ్ఞలు చేసుకుంటూ మైమరచిపోయి పరవశం చెందుతున్నారు.

ఆనందం అనే మత్తులో అందరూ మునిగిపోయి వున్నారు. వారి సంతోషానికి పట్టపగ్గాలు లేవు. రంగు రంగుల దీపాల తోరణాలలో- కన్నుల పండువగా వుంది. ఎక్కడ చూసినా?

ఆ ఆనందంలో మేనేజరు రామారావుగారి మేడకూడా పాల్గొంది. దీపాల తోరణాలతో వెలిగిపోతూంది. మేడ ముంగిల ఎన్నోరకాల మందుగుండు సామాన్లు అగ్నికి ఆహుతి అయిపోతున్నాయి. డబ్బుతో చేసే ఆ శబ్దాలకి తట్టుకోలేక కంపించిపోతూ భూమికి అంటిపెట్టుకు అణిగిపోయివుంది, ఆ ప్రక్కనే... గోపాలంవుంటున్న యిల్లు.

మూలమూలలకికూడ పోగలుగుతున్న ఆ ప్రకాశం, గోపాలంలాంటిబీదవాళ్ళకొంపలలోకి ఎంచేతో వెళ్లకుండా వుంది! అందుకే కామోసు దీపం నిలబడ్డానికి ప్రమిదక్రింద నేలే ఆధారం. అయినా ఆ దీపం కనికరించి ఒక్క కిరణాన్న యినా ఆ నేలమీదికి విసరదు!

గోపాలం యింటిముందు ఒక్కటే ఒక్క ఆముదం దీపం వెలుగుతూ వుంది. ఆ వెలుగునీడలమధ్య పంచలో నిశ్శబ్దంగా... మూడు జ్యోతులు నిలుచుని ...... ఆతృతగా చూస్తున్నాయి వీధివైపు. గోపాలంభార్యా లక్ష్మి – యిద్దరు పిల్లలు బాబూ, చెల్లి. 'దుబ్బా దుబ్బా దీపావళి' ఆముదం చెట్లతో కొట్టించి పిల్లలతో నిలుచుంది లక్ష్మి.

కాకర పువ్వొత్తులూ, మతాబాలూ, పటాకీలూ కాల్చడానికి వాళ్ళచేతులలో ఏమీ లేకపోయినా, చుట్టూ వెలుగుతున్నవన్నీ వాళ్ళకళ్ళలో మెరుస్తున్నాయి! కంటి

నీళ్ళలో ప్రతిబింబించి క్రిందికి రాలిపోతున్నాయి! చుట్టూ దృశ్యాన్ని చూస్తూనే ఆనందిస్తున్నారు ఆ పసివాళ్ళిద్దరూ! కాని లక్ష్మి... చూపు, మనసు యిక్కడ లేవు. ఆమె ఏదో ఆలోచిస్తూంది! ఎంతో అనుభవంతో విచారాన్ని భరిస్తూన్నట్టుంది. ఆమెకంటికి కా వింత ప్రకృతి మరోలా కనిపిస్తూంది.

అల్లకల్లోలమైన యీ ప్రపంచంలో నిర్భయంగా జీవించే జీవుల్లాగే... యింత సందడిలోనూ దీపాలు సిపాయిల్లా వరుసగా నిలబడి వెలుగుతున్నాయి. ఒకదానితో ఒకటి మాటాడుకుంటున్నట్టు తల లాడిస్తున్నాయి.

మనుషు లందరిలోనూ ఆత్మ ఒక్కటే అయినట్టు ఎలక్ట్రిక్ దీపాలు, గేస్ దీపాలు, క్రొవ్వొత్తులు, నూనె దీపాలు, యిలా ఎన్నని వెలిగించినా వెలుగునేకాదా యిస్తాయి!

ఆ దీపాల దివ్యవనంలో దీపాలు మనుష్యుల్లో వెలిగే జీవజ్యోతుల్లాగే కొన్ని అనవరోధంగా సాగే మానవుల్లా అఖండంగా వెలుగుతున్నాయి. మరికొన్ని నిరుపయోగంగా జీవచ్ఛవాల్లా మిగిలిన మానవాళిలాగే నీరసంగా మిణుకూ మిణుకూ మంటున్నాయి. నలిగిన బ్రతుక్కి నిట్టూరుస్తూ ప్రపంచంతో సంబంధం వదలి భౌతికదేహాలను వదలి ప్రకృతిలో లీనం అయిన జీవుల్లాగే వెలుగు కోల్పోయి, పొగ మాత్రం వదలుతూ, కమురుకంపుతో కాలిపోయిన వత్తులతో వున్న దీపాలు వున్నాయి.

క్రిందటేడు దీపావళికీ యీ ఏడు దీపావళికీ ఎంత తేడా? ఆయేడు గడిపినట్టు యీ ఏడు గడపలేదు. ఆయింట్లో

యిప్పుడు లేరు. ఆ ఆనందం ఇప్పుడు లేదు. ఆ వుత్సాహం ఇప్పుడు లేనేలేదు.

తన భర్త గోపాలం, రామారావుగారు పనిచేస్తున్న మిల్లులోనే పనిచేసేవాడు. కాని అతడు మేనేజరు, ఇతను కార్మికుడు.

అందరికీ తలమానికంగా, నోట్లో నాలికగా మెలిగే వాడు. అలాటివాడు కాబట్టే యిప్పటికీ అప్పు పుడుతూంది! మనసులో వున్నదేదో సూటిగా చెప్తాడు. ఒకరు నొచ్చుకుం టారని, బాధపడతారని మాత్రం వున్నది కప్పిపుచ్చి, వారి కనుకూలంగా మాట్లాడడం అతనికి చేతకాదు! నిష్కపటి. మాటలలో కరకుగా, నిర్మొహమాటంగా కనిపించినా హృద యంలో ఏమీ వుంచుకోని మనిషి. అందుకే యితనంటే కొందరికి కిట్టదు. అయినా నిజం నిలకడమీద తేలి అతన్ని ఎవరూ పల్లెత్తు మాటాడ్డానికి వీలుండేది కాదు! తన పనిని తాను విధిగా చేసే మనిషి.

అతను పనిచేస్తున్న మిల్లులో ఎన్ని లోపా లున్నా, పనికి ఒక కాలపరిమితి అంటూ వుండకపోయినా, పనివారికి ఏవిధమైన సౌకర్యాలూ లేకపోయినా, పని అంతా పాత కాలపు పద్ధతులలో సాగుతున్నా- కష్టానికి తగినంత జీతాలు లేకపోయినా- ఎవరూ అడిగే దిక్కేలేదు! ఎంతకాలం నుండో కార్మికులు వేచివున్నారు! ఎన్నోవిధాల శాంతియు తంగా, సంప్రదింపులద్వారా, తమ హక్కులకోసం - కాల పరిమితి, విశ్రాంతి, చాలినంత జీతం, కార్మికుల సౌక

ర్యాలూ- వీటికోసం రాయబారాలు పంపి పంపి నిరాశ చెందేరు! ఎవరికి విన్నవించుకున్నా వినిపించుకోనేదాత కన బడకపోయేడు.

ఆ మిల్లులోవాళ్లందరికీ గోపాలమే నాయకుడు. అందర్నీ నడిపించడం యితనే. అక్కడితో అంతవరకూ అభి మానులుగా వుంటున్న మిల్లు యజమానులకూ, అధికారు లకూ గోపాలం కంటకప్రాయమయిపోయాడు. అతనిమీద ఒక దృష్టి వుంచేరు. యితని ప్రతి అడుగూ, కదలికా కని పెట్టి జూచ్చారు.

ఆఖరికి ప్రత్యక్షంగా గోపాలం అధికారులనందరినీ కలిసి ఏదోఒకరాజీకోసం కోరేడు. తమ హక్కులు కొంత వరకయినా తీర్చుమని కోరేడు. కాని అహంభావంతో వాళ్లు పెడచెవిని పెట్టేరు. అతనిని, అతనిప్రయత్నాన్ని ఎంతో చులకనగా చూసి, పరాభవించేరు.

గోపాలం అందరితో సంప్రదించి, సమ్మెనోటీసు యిచ్చేడు. మిల్లు అధికారులు... 'మంచిపదవి యిస్తాం, సమ్మెకాకుండా చూడు' అని మధ్యవర్తులద్వారా రహస్యంగా ఆశచూపేరు. కాని స్వలాభంకన్నా సంఘశ్రేయోభిలాషి కాబట్టి దానికి లొంగిపోలేదు గోపాలం. దాంతో అతడు మరీ శత్రువయిపోయాడు.

మిల్లు అధికారు లేమాత్రం భయపడలేదు. సమ్మె నెదుర్కొనే ఏర్పాట్లు తీవ్రంగా చేయ మొదలెట్టేరు. పని వాళ్లు పడిస్తే కాసీ అయినా విడల్చని యజమానులు వారి

ప్రయత్నాలు విఫలంచేయడానికి ఎంతడబ్బు కావలిస్తే అంతా నీళ్లలా ఖర్చుపెట్టేరు. కోటి పెద్ద పెద్ద సంస్థలతోడు తీసుకున్నారు. అందరూ కలిసి పనివాళ్ల ప్రయత్నాలని ఢీకొన్నారు. సమ్మె ప్రారంభమయింది.

గోపాలాన్ని, మరికొందరు ముఖ్యులని... హక్కులకోసం పోరాడుతున్నా...విప్లవకారులని పేరుపెట్టి ఖైదుల్లో పెట్టేశారు. మిగతావాళ్లని సామ దాన భేద దండోపాయాలతో లొంగతీసుకుని- వాళ్లలో వాళ్లకి పార్టీలుచేసి, విభేదాలు, కక్షలూ పెంచి, లంచాలిచ్చి, యిలా ఎన్ని యుక్తులున్నాలో అన్నీ ఉపయోగించి... నాలుగురోజుల్లోనే సమ్మె న్యాయసమ్మతం కాదని నిరూపించి, సమ్మెలో పాల్గొన్న వారిని ఉద్యోగాల్లోంచి తీసేసేరు.

మొదటిదెబ్బ గోపాలానికే తగిలింది. కార్మికుల్లో కొందరు అది అన్యాయమని, తిరిగి పనిలోకి తీసుకోవాలని గోలచేసినా... ఎవరు వింటారు వాళ్లగోల? ఇంతకు పూర్వం వాళ్లంటే లోపలన్నా-ఏమో? ఏంచేస్తారో? అన్న భయమయినా వుండేది. ఈ సమ్మె చెడిపోడంతో యిపుడా భయంకూడా వారికి పోయింది. ఇదేం? అని అడిగే మొనగాడు మరి లేకపోయినాడు. ఇంక వాళ్లు నిరంకుశులు!... మిగతావాళ్లు ఆపాటి కాస్త ఉద్యోగంకూడా వూడిపోతుందేమోనన్న భయంతో బుద్ధిగా వూరుకున్నారు.

గోపాలం శిక్ష అనుభవిస్తున్నప్పుడూ, ఆ తర్వాతా కూడా అయిదునెలలపాటు... పాపం! కార్మికులు చందాలు వేసికొని కాస్తోకూస్తో సాయంచేస్తూ వచ్చారు! చాలీ చాల

కండా ఎలాగో యింతవరకూ గడుపుకు వచ్చేడు! కాని తాటి చెట్లెక్కే-వాళ్లని ఎంతకని ఎగతోస్తారు?... రానురాను వాళ్లూ వూరుకున్నారు! అందరికీ సానుభూతిమాత్రం వుంది! ప్రపంచంలో సంపాదించలేనిది సానుభూతే అని అంటాడు గోపాలం.

ఈ సంసారాన్నంతటినీ ఎవరు పోషిస్తారు? మిల్లు యజమానులు మరీతని వూసే ఎత్తలేదుసరికదా, ఆ పరి సరాల్లో యితణ్ణి చూస్తే యిం కేంముప్పు తెస్తాడో అని జాగ్రత్తపడుకున్నారు! ఇంక ఆ ఆశ లేదుకదా!

అతనికి మిగిలిన ఆస్థి సర్టిఫికేటులూ మొదలయిన ముఖ్యమయిన కాగితాలూ, అన్నిటిలోను "సమ్మెదారు!" అని శిలాక్షరాలతో వ్రాసిపారేశారు! అంచేత ఎక్కడికి వెళ్లినా ఆ మచ్చ చూసి ఎక్కడా ఉద్యోగం దొరుకలేదు. ఆర్జించి కుటుంబాన్ని పోషించుకొనే దారే అతనికి కనపడ లేదు. పలుకుబడి వున్నంతవరకూ అప్పులు చేశాడు. ఇంక యీతను కంటబడితే అప్పు అడుగుతాడేమో అని ఆప్తులూ, స్నేహితులూ, బంధువులూ కూడ తప్పుకుంటున్నారు. అప్పి చ్చినవాళ్లు మళ్లీ అడుగుతాడేమో అని భయంతో మారు మాటాడకండా వూరుకున్నారు.

ఇటువంటి పరిస్థితులలో గోపాలం వున్నాడు. అప్పు డనుకున్నాడు- 'తనకుమాలిన ధర్మం చేయకూడ' దని... కాని ఇప్పు డేం చేస్తాడు? అతని ఆలోచనంతా తన భార్యాపిల్లలిని ఎలాగో అలాగ పస్తుల్లేకండా చూడ్డమే!

ఈనాడు దీపావళి అని అతనికి తెలుసు! కాని తిండికే యింట్లో ఏమీ లేదు. ఇంక సరదాగా కాల్చడానికి పటాకీలూ, పండగా కూడానా? తనూ, భార్యా పెద్దవాళ్లు. ఆ సరదాలు లేవు. కాని ఆ పసిపిల్లలమాటేమిటి? వాళ్ళ సరదా ఏం కావాలి? ... ఆరాత్రి కడుపులు నింపుకొనే ప్రయత్నానికని బయలుదేరిన గోపాలం యింతరాత్రి అయినా రాలేదు! అతనికోసమే లక్ష్మి, బాబు, చెల్లాయి కళ్ళలో వత్తులు పెట్టుకు ఎదురుచూస్తున్నారు. ఏవేవో ఆలోచనలతో యీ లోకాన్నే మరిచిపోయిన లక్ష్మి-

“అమ్మా! యింకా ఎప్పుడిస్తావ్! చూడే అందరూ ఎలా కాలుస్తున్నారో! చక్రాలూ, పువ్వొత్తులూ, ఎన్నో! అమ్మా! మాక్కూడా పటాకీలు యివ్వవూ—గోపీ వాళ్ళమ్మ చూడే ఏలా కాలిపిస్తున్నదో? మమ్మల్ని పటాకీలు తెచ్చుకు రమ్మని పిలుస్తున్నాడు. అమ్మా యియ్యవే!”

అని బాబూ, చెల్లి గోలచేయగా పరాకుగా విని త్రుళ్లి పడి యీ లోకంలోకి వచ్చింది. పిల్లల ఆదుర్దా చూసి కళ్ళ నీళ్ళు కార్చింది. వాళ్ళను దగ్గరికి తీసుకుని - తల నిమురుతూ-

“మీరూ కాలుద్దురుగాని. మీ నాన్నగారు వెళ్లేరు కదూ! పటాకీలు యీ పాటికి తెస్తూనే” వుంటారు. మంచి వాళ్లుకదూ!” అని ఓదార్చ ప్రయత్నించింది.

“అందరూ యిప్పుడే కాలుస్తున్నారే! మరి మేమో?” అని అన్నారు, మొహాలు అదోలా పెట్టి.

"వాళ్లందరూ పెంకివాళ్లు. మీరు మంచివాళ్లు. అల్లరి పెట్టకండా నా మాట వింటారుకదూ!" అని అంది లోపలి నుండి పెల్లుబుకుతున్న దుఃఖాన్ని అణచిపెట్టుకుంటూ.

"అయితే యిప్పుడు కాల్చకూడదా అమ్మా!" అని ఆశపడులుకున్నట్టు బిక్క మొహాలువేసి అన్నారు పిల్లలిద్దరూ.

"అవునమ్మా! మీ నాన్నగారు వచ్చేక కాలవాలి. చూడండి! వస్తున్నారేమో?" అని మరిపించింది.

"అవునే, చెల్లీ! వాళ్లవన్నీ అయిపోతాయికదూ! అప్పుడు మనం ఊరించి మరీకాలుద్దాం!... ఏం?" అని బాబు, చెల్లీ లేని సంతోషం తెచ్చుగు... అమ్మ చెప్పిన మాటలకి లోపల ఏడవాలని వున్నా వూరుకొన్నారు. తండ్రికోసం చూస్తున్నారు.

లక్ష్మి మళ్లీ ఆ దృశ్యాన్ని చూసింది...

విరామం లేకుండా... అందరూ... మందుగుండు సామాను తగలేస్తున్నారు. కొందరు మితంగా కాలుస్తున్నారు! లేనివాళ్ళు తమలాగే మనసు కట్టుకోలేక రిక్తహస్తాలతో గుమ్మాలలోంచి వింతప్రకృతిని చూస్తున్నారు. మరి కొందరు కక్కుర్తికొద్దీ - పులి తిని విడిచేసిన ఎంగిలి మాంసాన్ని నాకే నక్కల్లాగా - వాళ్లు కాల్చిపారేసినవాటిని, సగం కాలగా విసిరిపారేసినవాటిని యింకా వెలుగుతాయేమోనన్న ఆశతో ఏరుకొని తృప్తిపడుతున్న అభాగ్యులు ఎందరో వున్నారు. ఎదురుగుండా కూర్చుని అంతవరకూ చూస్తున్న ముష్టిది సగం కాలిన కాకరపువ్వొత్తి ఒకటి ఏరితెచ్చి ఏడు

స్తున్న తన పిల్లకిచ్చి వెలిగించి నవ్వుతూంది. పిల్లకూడా ఏడుపుమాని నవ్వింది. లక్ష్మి అది చూసి అలాగయినా చేసి తన పిల్లల సరదా తీర్చలేనందుకు విచారించింది. తడి ఆరిపోయిన భూమిలా, జీవంపోయిన మనిషిలా, తైలం యింకిపోయిన దీపంలా క్రమంగా దీపావళిలో మధ్య మధ్య ఆరిపోయిన దీపాల కాళీలవల్ల - అక్కడక్కడక్కడ పళ్లూడిపోయిన తాతనవ్విన బోసినవ్వులా వెలవెబోతూంది.

పిల్లలిద్దరికళ్లూ వీధిలో వేగంగా వెతుకుతున్నాయి. 'అరుగో నాన్న'అని ఇద్దరూ పరుగెట్టి వెళ్ళబోయినారు గాని లక్ష్మి ఆపేసింది - వీధి అంతా నిప్పులతో నిండివుంది, బట్ట లెక్కడ అంటుకుంటాయో అని. పాలకోసం వురకలేసే తువ్వాయిల్లా వుండిపోయారు.

దూరంనుండి దీపాల వెలుగు చీకట్ల తెరలలో బరువయిన సంచీతో లీలగా, మెల్లగా నడుస్తూ వస్తున్నాడు. గుమ్మంఎక్కగానే పట్టు తప్పించుకొని పిల్లలిద్దరూ అతని కాళ్ళలో పడ్డారు.

“నాన్నా పటాకీలేకదూ యివ్వన్నీ” అని సంచీ తీసికొని యింట్లోకి పరుగెట్టేరు. పిల్లల తొందరని చూసి గోపాలం విచారంలో బరువయిన హృదయంతో - రానికాళ్ళతో యింట్లోకి వెళ్లేడు.

“అమ్మా యివన్నీ పటాకీలే కదూ వేగిరం ఇవ్వవూ?” అని మళ్లీ అడగడం – “అవును యివన్నీ పటాకీలే. మీకేనమ్మా!” అని తల్లి చెప్పడం, అంతలోనే వీధిలో “ఢాం” అని అఘూధా ప్రేలడం ఒక్కసారిగా జరిగేయి.

ఆ శబ్దంవిని బాబూ, చెల్లీ ఆనందంతో - "అమ్మా! చూడే ఎలా 'ఢన్' మని పేలిందో? మా కోటి యివ్వావూ పేలుస్తాం!" అని అడిగేరు.

అమాయకులయిన ఆ చిన్ని హృదయాలకి ఆ శబ్దం యెంతో ఆనందంగా ఉంది. కాని అనుభవజ్ఞులయిన ఆ తల్లి దండ్రులకి ఆ శబ్దం గుండెల్ని చీల్చుటకు బయటకు పోయింది. ఒకరి మొహాలొకరు సిగ్గుతో చూచుకున్నారు. ఇద్దర్నీ యిద్దరూ తీసుకు కన్నీరు కార్చేరు.

తల్లిదండ్రుల అవస్థ అర్థంకాక ఆ పసివాళ్లిద్దరూ నివ్వెరపోయిచూస్తూ ఉండిపోయారు. కాని వాళ్ళచేతు లింకా పటాకీ లడుగుతూనే ఉన్నాయి. "అన్నం తిని కాలుద్దురుగాని రండి" అని మాటలు మార్చి ఆ యిద్దర్నీ మరిపించ ప్రయత్నించింది లక్ష్మి.

పిల్లలు అన్నం తింటుండగా భర్తదగ్గరకు వెళ్లి "పిల్లలకు ఏమయినా తెచ్చారా?" అన్నట్టు చూస్తూ నిలబడింది. ఆ వుద్దేశ్యం గ్రహించి "ఈ కాస్తబియ్యం సంపాదించి తెచ్చేసరికి తలప్రాణం తోకకొచ్చింది. మొహమాటస్తులుకూడా అప్పు పుట్టదని చెప్పేసేరు! ఈ బియ్యం అప్పుయిస్తూ ఆ కోమటి ఏమన్నాడో చెప్పలేను. వాడికి యించుమించు నలభై రూపాయ లివ్వాలి. జేబులో ఒక్క కాని లేదు. ఏం పెట్టి కొని తెచ్చేది? పసివాళ్ళకోర్కెలు తీర్చలేని బ్రతుకయిపోయింది. అయినా అదేమిటో ఎప్పటికీ ఆ భగవంతునికి మనపై దయరాకుండా వుంది. అక్కడికీ నలుగురైదుగురు దగ్గిరికి వెళ్లేను యాచించి తెద్దామని, కాని, ప్రాణం నిలబెట్టుకుందికి

బియ్యాన్నే యివ్వనివాళ్లు జల్సాల కిస్తారా? ఏమని మొహం యీడుస్తారో అని నోటివరకూ వచ్చినా అడగలేకపోయాను"

అని రెండుచేతులూ ముఖాన్ని కప్పుకొని దుఃఖాన్ని ఆపుకుంటూ అన్న భర్తను చూసి ఆమెకూ బొటబొటా కళ్ళంట నీళ్లుకారేయి. దగ్గరకు వెళ్లి చేతులుతీసి తల నిమిరింది ప్రేమతో. ఆమెవాత్సల్యంతో అతనికి గుండెభారం సగం తగ్గినట్టయింది. చీరకొంగుతో కళ్లు తుడుచుకుని మళ్లీ పిల్లలు అడిగితే ఏం సమాధానం చెప్పాలో తెలియక వాళ్లు దగ్గిరికి వెళ్లిపోయింది లక్ష్మి.

పిల్లలు అన్నంతిని తండ్రి తెచ్చిన సంచీ గాలిస్తున్నారు. కాని, వాళ్ళచేతికి పటాకీలు ఎక్కడా దొరకలేదు. వాళ్ళ మొహాల్లో దుఃఖం పొంగి పొంగివచ్చేస్తూంది. "అమ్మా ఏవే పటాకీలు? యింకా ఎప్పుడు కాలుస్తాం?" అని అడిగేరు. తల్లి ఏమీ జవాబు చెప్పలేదు.

తండ్రి వాళ్లిద్దర్నీ పిలిచి, తను బీడీ లంటించుగునే అగ్గిపెట్టె యిస్తూ, "యిందండి, దీనితో సరదా తీర్చుకోండి బాబూ! అమ్మా! మీకు రెండుపటాకీలయినా కొనిపెట్టలేక పోయాను!" అని మొహం దాచుకున్నాడు.

వాళ్లిద్దర్నీ వీధిలోకి తీసుకుపోయింది తల్లి. ఆ పసిపిల్లల కర్థమయిందో లేదో గాని మళ్లీ పటాకీలు యిమ్మని అడగలేదు. ఆ అగ్గిపెట్టెలో నాలుగుపుల్లలూ వెలిగించేసి, తర్వాత పక్కింటి రామారావుగారి గుమ్మంలోకి పోయి, వాళ్ళు నవ్వుతూ కేరుతూ పటాకీలు కాలుస్తూంటే చూస్తూ నిలుచున్నారు.

లక్ష్మి భారంగా నిట్టూర్చి, భర్తకి తనకి వంట ప్రయత్నం చేయడానికి లోనికి వెళ్లింది.

బాబు, చెల్లి అంటే రామారావుగారిపిల్లలకి సరి పడదు. వాళ్ల మేడ ఆకాశంతో కబుర్లాడుతూ వుంటుంది. వీళ్ల యిల్లు అటువయిపు చూడలేక భూమినే పట్టుగు అణగారి వుంటుంది. రామారావుగారికి వచ్చే ఆదాయంలో నూరో వంతుగూడా గోపాలానికి ఆర్జనలేదు. లేకపోతేపోయె. వీళ్ల మీాద కాస్త కనికరంగాని, జాలిగాని, సానుభూతిగాని లేదు సరికదా, వాళ్లపిల్లలు వీళ్లతో మాటాడరు. 'నన్ను ముట్టు గోకు నా మాలకాకి' అని వుడికిస్తారు, రామారావుగారు టర్కీటవలు కప్పుకొని వీధిగుమ్మంలో నిలుచుంటే గోపాలం చినుగు గుడ్డలతో వంగి వంగి నడిచి ఆ ప్రక్కనుండి పోవల సిందే!- అంత తారతమ్యం వాళ్లమధ్య.

అందుకే ఆశగా, అమాయకంగావచ్చి, యెడంగా నిలిబడి చూస్తూనే ఆనందిస్తూనే తృప్తిపడుతూన్న ఆ పసి వాళ్లని చూసేసరికి రామారావుగారిపిల్లలకి ఒళ్ళు మండింది. అసహ్యం కలిగింది.

"ఎందుకొచ్చేరు మాయింటికి పొండి మీా యింటికే!" అని మూతులువిరుస్తూ అన్నారు రామారావుగారిపిల్లలు.

"దూరంనుండి చూస్తేతప్పా, మిమ్మల్నేం చేశాం?" అన్నాడు బాబు. మీా రెందుకొచ్చారో మాకు తెలీదా? మేం యిటుతిరిగి కాలుస్తూంటే దొంగతనంగా పట్టుగు పారిపోడానికే కాదూ? పొండి, మేం పటాకీలు యివ్వం!" అని మిాదికొస్తూ అన్నారు.

"మాకు పటాకీలు అక్కర్లేదు. మా నాన్నగారు తెచ్చేరు. ఆనక కాల్చుకుంటాం?" అని అంది చెల్లి అహం భావంతో.

"అయితే ఇక్కడ వుండొద్దు మీయింటికే పొండి. ఊ!"

"మేం వెళ్లం. యిక్కడే నిలబడిచూస్తాం!" అని మొండికేశేరు బాబూ, చెల్లి చాపల్యంచేత. రామారావు గారి పిల్లలకి కోపం వచ్చింది– "పోతారా పోరా! వెళ్లక పోతే చూడండి" అంటూ. "నాన్నగారూ! చూడండి. యీ వెధవలు మా పటాకీలు లాక్కుంటున్నారూ!" అని అరిచారు. ఆ అరుపులువిని రామారావుగారు వచ్చేరు. రామారావుగారిని చూసి గటగడ వణికిపోయేరు. రామా రావుదృష్టి వాళ్లమీద ఎంతో నిశితంగా పడింది. తనపిల్లలు చెబుతున్నది నిజమా, అబద్ధమా? అని ఆలోచించవలసిన పని అతనికి లేదు – వాళ్ళనుకున్నది అయిపోవడమే కావాలి గాని నిజానిజాలతో అవసరం లేదు.

"ఏంవన్రా! ఓరి వెధవల్లారా! మీరా? ఏం, లేక పోతే అడుక్కోరాదూ? దొంగవెధవల్లారా! పొండి ఊఁ!" అని వెనకేసుకురావడమేమిటి– అతని ముద్దులకొడుకు 'మనోహర్' చాచి ఒక్క లెంపకాయ బాబుని కొట్టేడు. బాబుకి తిక్కెక్కింది. ముందు వెనుకలు ఆలోచించకుండా తనుకూడా మోహనరావుకళ్లు జిగేల్‌మన్నట్టు తినిపించేడు.

పరిస్థితి విషమించింది. రామారావుగారి పిల్లలందరూ కలిసి – బాబూ, చెల్లిని మీదపడి బాగాకొట్టి మొట్లమీంచి

క్రిందకు త్రోసేసేరు. రామారావుగారు చిరునవ్వు నవ్వుతూ చూసీ చూడనట్టు పూరుకున్నారు. బాబు, చెల్లి లేచి కసి కొద్దీ వారిని చూస్తూ చేసేదిలేక యింటివయిపు నడిచేరు. వాళ్ళలా వెళ్లిపోతూండడం చూసి రామారావుగారిపిల్లలికి వాళ్ళనింకా వుడికిద్దామని బుద్ధిపుట్టింది. మోహనరావు ఒక్క చిచ్చుబుడ్డీని బాబుమీదికి విసిరాడు. అది బాబునీ చెల్లినీ వెంట బడింది. ఇద్దరూ భయపడి యింట్లోకి దూరిపోయేసరికి చిచ్చుబుడ్డీ సూటిగావెళ్లి యింటిపంచలో దూరింది. ఇల్లు కమ్మలదేమో, కొద్దిక్షణాల్లో అంటుకుంది.

రామారావుగారు అదిచూసి గాబరా పెత్తేడు. అంతవరకు వస్తుందని అనుక్కోలేదు. ఎవరూ చూడలేదేమో అని అనుకున్నా కళ్లారా చూసినవాళ్ళు సహాయానికి ఆయత్త పడుతున్నా రప్పుడే!... పాక పూర్తిగా రాజుకుంది, మంటలు బయులుదేరాయి, తాటాకులు పటపటలాడేయి.

అప్పుడే భోజనానికి కూర్చున్న గోపాలం భార్యా లోపల కమ్ముకున్న పొగనీ, చొచ్చుకొస్తున్న మంటలనీ చూసి...భయంతో యివతలికి వచ్చేసేరు. సిద్ధాన్నం... ప్రాప్తం లేకపోయింది. వారి కంతా అయోమయంగా వుంది. పిల్లలు పరుగెత్తిరావడం వాళ్ళు చూడలేదు. ఇంకా రామారావుగారియింట్లో వున్నా రనే వాళ్లభావం. చుట్టూవున్న వాళ్ళు కొందరు సరదాలన్నీఆపి పరుగుపరుగున వచ్చేరు, సాయంచేయడానికి. అప్పటికే అగ్నిహోత్రుడు విజృం భించేడు— అప్పటిదృశ్యం చూస్తే వేయిపడగల పాము

విప్పారుకునివచ్చి నాలుకలు కీటుతున్నట్టు... అగ్నిశిఖలు భూమిమీదికి లేస్తున్నాయి.

అంతవరకూ ఆ పాకలో దీపాలులేనికొరత తీరింది. ఒక్కటే ఒక్క అఖండదీపం వెలిగింది. చుట్టుప్రక్కల అన్ని దీపాలని నిర్జీవంచేసింది. అన్నీ వెలవెలబోతూ యిటువయిపే చూస్తున్నాయి. ఆ పాకలో పటాకీలు కాల్చలేదన్న లోపం తీరింది. శగలు పొగలు— చిటపటలు— ధనధనలు— పెళ పెళలు— ఒకటేమిటి, అన్నీ ఒక్కసారి అంటుకున్నాయి. ఆ గుడిశమీద లేస్తున్నమంటలు మ్రింగడానికి పరుగెడుతూ వస్తున్న రాక్షసి చింపిరిజుత్తులా ఆడుతున్నాయి. ఆ మంటలు కోపంతో మండుతున్న ఎర్రటి కళ్ళలా మెరుస్తున్నాయి!

అంతలో లోపలినుండి చెల్లి పరుగెట్టుకువచ్చింది. "అన్నా, అన్నా" అని అరచి అలసిపోయింది! గోపాలం, లక్ష్మి గుండెలుబాదుకున్నారు. గోపాలం మంటల్లో వురికేడు. అంతా మంటలు, పొగ, నిప్పు, భయం. ఏమయిందీ ఎవరికీ తెలియలేదు కొంతసేపు. లోపలనుండి నల్లటి ఆకారం పైకి వచ్చింది— చేతిలో ఏదో వస్తువతో. ఇవతల కొచ్చి— రోడ్డుమీద బరువుగా దింపింది. ఏ ముంది? లక్ష్మి మీదపడి గోలుగోలున ఏడ్చింది. ఆ ఏడ్పుకి కాలుతున్న పాక భయపడి ఒణికి నేల కొరిగింది.

దారిద్ర్యంకూడా మనిషిని రక్తమాంసాలు, తడి వున్నంతవరకూ పీడించి వదిలేస్తుందేమో? అలాగే భగభగ మండే మంటలచేతికి మరేమీ దొరక్క— చల్లబడిపోతు న్నాయి. తనపని తానుచేసి నిప్పుదేముడు నిమిషాలమీద

నిష్క్రమిస్తున్నాడు. కణకణలాడుతూన్న నిప్పులు యింకా కోపంగా గోపాలం సంసారంవేపు చూస్తూనేవున్నాయి. హారంలేనిపొట్ట నడ్డికి అంటుకుపోయినట్టు, ఏమీలేని గోపాలం కొంప నేలమట్టం అవడమే నిదర్శనం. ఇంక గోపాలానికి మిగిలింది అంతే! అంత చురుకయిన బాబూ చలనంలేకుండా పడివున్నాడు తల్లిచండ్రులచేతుల్లో.

వాడి చిన్నపెదిమలు యింకా "నాన్నా పటాకీ యివ్వవూ!' అని అడుగుతున్నట్టే వున్నాయి. నూరేళ్ళ బ్రతుకూ యిలా బండలయిన బాబు!- ఆ తల్లిదండ్రుల హృదయాల్లో ఏవో ఆశలు పూయించి, అడియాశలు చేసి ఏ మనుకోమని వెళ్ళిపోయేడో?

"అమ్మా నాన్నా!" అన్న జంట పిలుపుల్లో మందరం మందగించింది. అపస్వరం పలికింది. మరి పలకకండా తెగిపోయింది. నవ్విననోటనే ఏడుస్తారు. పొగడిననోటనే తిడతారు. తెలిసినా తెలియనట్టుంటారు. ఆనందబాష్పాలు రాల్చిన కళ్ళే దుఃఖంతో కన్నీరు కారుస్తాయి! ఇదో సృష్టిచిత్రం. మనుష్యుల్లో స్వభావం ఒకచిత్రం. ఇంతవరకూ హర్షధ్వానాలతోనూ ఆనందంతోనూ నిండిన ఆ ప్రదేశంలో రోదనా వేదనలు, హాహాకారాలు వినబడుతున్నాయి. అవీ కొంతవరకే! ఆ పరిధి దాటగానే యథాప్రకారం- ఇంటింటా ఆనంద దీపావళి సాగుతూనేవుంది. ఎవరిపని వారిది. ఎవరిసుఖం వారిది. ఒకరికోసం ఒకరు ఎందుకు తమ ఆనందాన్నిగాని, కోర్కెలనిగాని చంపుకుంటారు?

నడివీధిలో కొడుకుశవంతో కుమిలిపోతున్న వారికి ఆ అగ్గిపండుగ తనశిఖలతో నఖశిఖపర్యంతం కాల్చివేస్తున్నట్లుంది! కాని ఆ పండగే తక్కిన ఆబాలగోపాలానికి ఆనందదాయకంగా వున్నది. గోపాలం దంపతులకది ఒక కాష్టంలాగుంది. చుట్టూ దీపావళిచేసుకుంటున్న ప్రజలు దయ్యాల్లాగూ, వారిచేతిలో పటాకీలు కాలుతున్న దివిటీలలాగూ అవుపడుతూ తమచుట్టూ నాట్యం చేస్తూన్నట్టుంది. ఒకరిచావు ఒకరి బ్రతుక్కి ఆధారం. ఒకరి లేమి మరొకరికలిమికి కారణం. ఒకరినవ్వు యింకొకరి దుఃఖానికి నాంది.

"కడుపుకోసం ఎన్నికక్కుర్తులయినా పడ్డాగాని ఒక్క కానీయిచ్చి పటాకీలుకొని నీసరదా తీర్చలేకపోయానూ!" అని గోపాలం-

"పటాకీలు లేకపోయినా వున్నాయని మరిపించి నిన్ను పొట్టబెట్టుకున్నాను బాబూ!" అని లక్ష్మి- యిద్దరూ కంటికీ మంటికీ ఏడుస్తున్నారు.

ఇంతలో అక్కడికి వచ్చేడు వెంకట్రావు ఒక చిన్న సంచీతో. వచ్చి, ఆ దృశ్యంచూసి, నిలువునా నీరయిపోయి కూలబడ్డాడు. వాళ్ళతోకూడా కలిసి ఏడవడం మొదలు పెట్టేడు. వెంకట్రావు గోపాలానికి మిల్లులో స్నేహితుడు. అప్పుడప్పుడు వచ్చి ఆదుకుంటూ యోగక్షేమం విచారించి పోతూవుంటాడు.

"వెంకట్రావుమామయ్యొచ్చేడే!" అని చెల్లాయి అతణ్ణి పట్టుకొని భోరున ఏడ్చింది. గోపాలం లక్ష్మి మరీ దుఃఖించేరు.

"అయ్యో! ఎంతఘోరం జరిగిపోయినది? నేను రాక పోయినా బాగుండేది! యింకా చిన్నవాళ్ళ కిద్దాంకదా అని పటాకీలు తెచ్చేను. ఇంటినించి నడిచివచ్చేసరికి ఆలస్యం అయింది... అయ్యో! యింకేం పటాకీలు? గోపాలం! ఎంత పాపం చేశావయ్యా?..." అని నెత్తీనోరూ బాదుకున్నాడు.

"పటాకీలు తెచ్చావా? ఏవీ- ఏవీ-తే? ఆఁ!- యివిగో ఎన్నో ఉఁ- మతాబాలు, పటాకీలు, కాకరపువ్వొత్తులు- ఎన్నో-తీసుకోరా, తీసుకో బాబూ! నాకన్నా మీ మాఁవయ్య నయం. ఇంద! మీ మాఁవ తెచ్చేడు తీసుకో! హాహాహా! కాల్చండి? కాల్చండి? నా మొహం కాల్చండి?-" అని గోపా లం వెంకట్రావు తెచ్చిన పటాకీలుతీసి చేత్తోపట్టుగు ఆవే శంతో అరవడం మొదలెట్టేడు. వెంకట్రావుకి మతిపోయింది. లక్ష్మి నిశ్చేష్టురాలయింది. గోపాలం మరీ యిలా అయిపో తున్నాడు!

అందరూ గోపాలాన్ని పట్టుకొని ఓదారుస్తున్నారు. అందులో 'గోపాలం!' అన్న ఒక కంఠం ప్రత్యేకంగా విని పించింది. అందరూ అటు చూశారు నిశ్శబ్దంగా, ఆశ్చర్యంగా. ఎదురుగుండా ఎవరు?

"రామారావుగారు!" అవును, 'రామారావుగారే' వచ్చి నిలుచుని గోపాలం అని పిలుస్తున్నాడు. అతణ్ణిచూసి, చెల్లాయి "వీళ్ళ మోహన్ రావే నాన్నా మనయింటిమీదికి చిచింద్రీ వదిలేడు!" అని అంది.

రామారావు కదిలేడు. అదోలాగయిపోయాడు ఆమాటవిని. అందరివైపు అనుమానంగా చూశాడు.

అతనిలో భయం అందరికీ కనబడుతూనేవుంది. అయినా రామారావు పైకి కనబడనివ్వలేదు.

"గోపాలం! నీకు చాలా ఘోరం జరిగిపోయింది! పోయినవాళ్ళతో పోలేం. మనస్సు కుదుటపర్చుకో. నీకు జరిగిన యీ నష్టాన్ని నేనుకాదుకదా ఎవ్వరూ తీర్చలేక పోయినా, పొరుగున వున్నందుకు నే చేయగలిగింది చేస్తాను. మిగతావిషయాల్లో నీ కేమీ నష్టంలేకండా చూస్తాను. అధికారులకుచెప్పి మళ్లీ మిల్లులో నిన్ను వేయించే ఏర్పాటు చేస్తాను. గుండెనిబ్బరం చేసుకో! విచారించకు" అని సాను భూతి చూపాడు.

అందులో అర్థం అందరికీ గోచరిస్తూనేవున్నా ఎవరూ సాహసించి ఏమీ అనలేకపోయినారు.

అబ్బ! ఎంతలౌక్యం! ఎంత సానుభూతి! అతని మాటల్లో పిడుగుపడినతర్వాత అయే ధ్వనే ప్రతిధ్వనిస్తోంది గాని, జాలి వుందా? సానుభూతిలో, జాలిచూపడంలో, విచా రించడంలో కూడా ప్రతిఫలాపేక్షతో కూడిన నటన- ఏదో ఎత్తుతో కూడిన వుత్తమాటలు, వంచన- ఆ మెత్తనిమాటల వెనక ఎటువంటి కత్తిపోట్లు.

గోపాలం! అసహ్యంగా అతనివైపు చూశాడు. అతనికి ఒళ్ళూపై తెలియలేదు. ఉద్యోగం వూడదీసినా అతనిజోలికి త నెన్నడూ వెళ్ళకపోయినా యింకా ఎందు కింత పగ?

"రామారావుగారూ! ఎక్కడనుండి వస్తున్నాయి ఆమాటలు! ఈ సానుభూతి వెనకాల అంతరార్థం ఏమి టుందో- అది నాకు తెలుసు! కాని మీ కేమీ అపకారం

చెయ్యను. నా కొంప కాలడానికి, కొడుకుమరణానికి మీరే కారణం అని నాకు తెలిసినా, అందరూ సాక్ష్యం చెప్పగల రనే నమ్మకంవున్నా నేను చెప్పను. నేను అలా రిపోర్టుచేస్తా ననే కాబోలు! యీ మొసలికంటినీరు, మీ కాభయం అక్క-ర్లేదు. నాకు తిరిగి వుద్యోగంయిస్తానని నానోరుకట్టవలసిన పనిలేదు. వెళ్ళండి. కొంతసేపయినా నిశ్చింతగా మమ్మల్ని ఏడవనీండి. నాకొడుకుని యివ్వగలరా? చెప్పండి- మీ మిల్లులోనే కాదు, మీయింట్లో మీ పాదాలదగ్గర చాకిరీచేస్తూ పడివుంటాను. మిమ్మల్ని దేవతలా పూజిస్తాను! దయ చెయ్యండి, రామారావుగారూ! దయచేయండి!"

అని గోపాలం తిరిగి తన కొడుకుమీదపడి ఏడవడం మొదలెట్టేడు.

ఆ మాటలు రామారావుగారి అహంమీద దెబ్బ తీశాయి. అక్క-డ మరి నిలబడలేక మెల్లగా వెళ్ళిపోయి— "వెధవలు చస్తున్నా అహంమాత్రం చావదు" అని పళ్ళు కొరికి తలుపువేసుకున్నాడు.

గోపాలం దుఃఖాన్ని ఎవరూ ఓదార్చలేకపోయారు?

"నాన్నా పటాకీ యివ్వవూ?" అని అడుగుతున్నట్టే వుంది ఆ కొడుకు మొహం? ఎటుచూసినా "నాన్నా పటాకీ లివ్వవూ?" అని ప్రకృతిలో ప్రతివస్తువా ప్రతిధ్వనిస్తున్నట్టే వుంది. గోపాలం ఎవరితోనూ మాటాడకండా మెల్లగా లేచాడు. భుజంమీద కొడుకుశవాన్ని వేసుగున్నాడు. ఒక చేత్తో పటాకీసంచి పట్టుకున్నాడు. వెనకనుండి ఎంతమంది

వారిస్తున్నా వినిపించుకోలేదు. మరి అతణ్ణి ఎవ్వరూ అపలేక పోయినారు.

లక్ష్మిని, చిన్నపిల్లని ఓదార్చి ధైర్యంగా వుండమని చెప్పి వెంకట్రావు ఆ వెనకే బయలుదేరాడు, గోపాలం కోసం.

# పానకంలో పుడకలు

హుచ్చుటగా ఆ మూడు రోజులూ గడవక ముందే చెప్పా చెయ్యకండా అల్లుడుగారు వెళ్ళిపోవడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. గుసగుసలు బయలుదేరాయి. సారి పెళ్ళివారందరూ ముక్కులమీద వేళ్ళుంచుకున్నారు. ఒకళ్ళ చెవులొకరు కొరుక్కుంటున్నారు. తలోక విధంగా వ్యాఖ్యా నిస్తూ గింజుకు పోతున్నారు.

"అదేంచోద్యమమ్మా!" "ఇలా ఎక్కడా జరగలే"దని కొందరన్నారు.

"ఇంటా వంటా లేనిది ఇదేమిటి?" "నలుగురిలో నగు బాటు కాదా" అని యింకొందరన్నారు.

"ఈ విడ్డూరం ఎక్కడా చూడలే"దని, "మా కాలంలో మేం ఎరగం" అని మరికొందరన్నారు. వంశానికే ఏదో అప ఖ్యాతి వచ్చేసిందని అందరూ యీ విధంగా అనుకుంటూ దవడలు సొట్లుపడేటట్లు నొక్కుకుంటున్నారు.